క్లుప్తంగా

నేడు కుమారదేవంలో గడప గడపకూ మన ప్రభుత్వం

కొవ్వూరు: మండలంలో కుమారదేవం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సారథ్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి పథకాలు దోహదం

పెరవలి: డ్వాక్రా మహిళల ఆర్థిక పురోగతి సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వివిధ పథకాలు దోహదం చేస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంపీపీ కార్నెల్ల ప్రసాద్ తెలిపారు. మండలంలోని కానూరు వెలుగు కార్యాలయంలో శనివారం డ్వాక్రా మహిళలకు సంఘాల పటిష్టతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, కొమ్మిశెట్టి రాము, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజనీ, ఏపీయం రమేష్, డ్వాక్రా సీసీలు, సీఏలు మహిళలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వసంతకుమార్ మృతికి సంతాపం

దేవరపల్లి: ఉమ్మడి మాజీ మంత్రి వట్టి వసంత కుమార్ మృతికి దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు సంతాపం వ్యక్తం చేశా రు. వట్టి వసంత కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వసంతకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేవీకే దుర్గారావు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్ పాల్గొన్నారు.

చాగల్లు రైల్వేగేటు మూసివేత

చాగల్లు: చాగల్లు రైల్వేగేటు వద్ద రైల్వేలైను మరమ్మతు పనులు శనివారం నుంచి ప్రారంభించారు. పనుల నిమిత్తం గేటును రైల్వే అధికారులు మూసివేశారు. గేటు ఉన్న ప్రదేశంలో కుంగిన ట్రాక్‌లను ఎత్తు చేస్తున్నామని, కొత్త స్లీపర్స్ వేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 10న గేటు తెరుస్తామని ప్రకటించారు. గేటు మూసివేత సమాచారం సమీప గ్రామాల ప్రజలకు తెలియజేయకపోవడంతో రైల్వే అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

చాగల్లు: జగనన్న కాలనీలో గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ పి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలో నెలటూరులో శనివారం హౌసింగ్ డేలో భాగంగా జగనన్న కాలనీలో గృహనిర్మాణాలను డీఈ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఏఈ బి.ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ నాయకులు గేడా శ్యామ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

చురుగ్గా షెడ్ల నిర్మాణం

ఉండ్రాజవరం: గ్రామాలను పరిశుభ్రంగా, పచ్చగా, ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రభుత్వం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు నిర్మిస్తున్నారు. మండలంలో 15 గ్రామ పంచాయతీలకు 12 చోట్ల సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు ఉండగా మిగిలిన మూడు గ్రామాల్లో షెడ్లు లేకపోవడంతో చెత్తను తరలించేందుకు పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు పడేవారు. పాలంగిలో రూ.7లక్షలు, కాల్ధారీలో రూ.5.50 లక్షలు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఆ గ్రామాల్లో షెడ్లు నిర్మిస్తున్నారు. ఈ పనులను ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామి నాయుడు పరిశీలించారు.

రేషన్ బియ్యం వేలం

గోపాలపురం: వివిధ కేసుల్లో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యానికి శనివారం రెవెన్యూ అధికారులు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వేలం నిర్వహించారు. 153 క్వింటాళ్ల బియ్యాన్ని రూ. 33,00,300 చెల్లించి పాటదారుడు తీసుకెళ్లినట్టు అధికారి కె విజయకుమార్ తెలిపారు.

పాఠశాల విద్యార్థులు బైక్‌లు నడిపితే చర్యలు

నిడదవోలు రూరల్: పాఠశాల విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు బైక్‌లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ హెచ్చరించారు. మండలంలోని పెండ్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నిబంధనలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సుభానీ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా మైనర్లు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్సై పరమహంస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లజర్ల ఇన్‌చార్జి తహసీల్దారుగా కిషోర్‌కుమార్

నల్లజర్ల: నల్లజర్ల ఇన్‌చార్జి తహసీల్దారుగా డిప్యూటీ తహసీల్దారు వర్ధనపు కిశోర్‌కుమార్ నియమితులయ్యారు. ఇంతవరకు ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన మహమ్మద్ మక్సూద్ ఆలీ తూర్పుగోదావరి కలెక్టరు కార్యాలయంలో ల్యాండ్ సెక్షన్ సూపరిండెంట్‌గా బదిలీ అయ్యారు. గతేడాది జూలై 14న మక్సూద్ ఆలీ ఇక్కడ తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- దేవరపల్లి సమావేశంలో గృహసారథులకు దిశానిర్దేశం



దేవరపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను గడప గడపకు తీసుకువెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విజ్ఞప్తి సూచించారు. స్థానిక ఏవీఆర్ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన శనివారం మండలంలోని వైఎస్సార్ సీపీ గృహసారథులు, గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే తలారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో రూ.1.80 లక్షల కోట్ల వ్యయంతో సంక్షేమ పథకాలు అమలు చేసినట్టు ఆయన చెప్పారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అన్నివర్గాల ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని గృహసారథులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి వైఎస్సార్ సీపీ గృహసారథులు ప్రతి ఇంటినీ సందర్శించాలని, దీనికి సంబంధించిన కిట్లు అందజేస్తామని ఆయన తెలిపారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గృహసారథులు కీలకంగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైస్ ఎంపీపీలు కొర్లపాటి అరుణ, సాదే సుబ్బారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్రబాబు, నియోజకవర్గ మహిళా కన్వీనర్ ఆచంట అనసూయ, పార్టీ జిల్లా కార్యదర్శులు గడా జగదీష్, గడా రాంబాబు, సర్పంచ్ కడిమి వీరకుమారి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, పలువురు సొసైటీ అధ్యక్షుడు, సర్పంచ్‌లు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, గ్రామ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొవ్వూరులో కలిసిన 1997-79 ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు

కొవ్వూరు: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1977–79 ఇంటర్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడిన చిన్ననాటి స్నేహితులంతా కలిసి సందడి చేశారు. బాల్య జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని, ఒకరినొకరు ఆటపట్టించుకుని ఆహ్లాదంగా గడిపారు. స్నేహితుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్న అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను సత్కరించి ఆశీస్సులు అందుకున్నారు. కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు అందించిన నగదు పారితోషికాలను ప్రస్తుత ప్రిన్సిపల్ గారపాటి సతీష్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. బాలదారి హరిమోహన్, పీఎల్ఎస్ ప్రసాదరాజు, కోడూరి లక్ష్మీనారాయణ, ఎంపీఎల్ విజయభాస్కర్, సీహెచ్ రవికుమార్, కంఠమణి కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థుల పఠనా సామర్థ్యాలపై దృష్టి

ఉండ్రాజవరం: 3, 4, 5 తరగతులు ఉన్నత పాఠశాలల్లో విలీనం అయినందున ఆ విద్యార్థుల పఠనా సామర్థ్యాలపై దృష్టి సారించి వాటిని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. మండలంలో మోర్త ఉన్నత పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి, రికార్డులు పరిశీలించారు. 8వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లు వాడుతున్న విధానాన్ని పరిశీలించారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు సుమారు 60 నిమిషాల వరకూ ఇంటి వద్ద ట్యాబ్‌ల్లోని కంటెంట్‌ను చూడాలన్నారు. పాఠశాలలో నాడు–నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పీవీఎస్.నాగరాజు పాఠశాల హెచ్‌ఎం షేక్ సూర్జాన్ పాల్గొన్నారు.

మోనూ ప్రకారం ఆహారం అందించాలి

పెరవలి: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో మెనో ప్రకారం ఆహారం అందించాలని తూర్పు గోదావరి జిల్లా విద్యా శాఖాధికారి (డీఈఓ) ఎస్ అబ్రహం హెచ్చరించారు. పెరవలి మండలంలోని కాకరపర్రు, పెరవలి ఉన్నత పాఠశాలలను శనివారం ఆయన పరిశీలించి, భోజనం రుచి చూసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం తయారీలో నాణ్యత, శుచి, శుభ్రత పాటించాలని, మెనూ ప్రకారం ఆహార పదార్థాలు తయారు చేయాలని తెలిపారు. పెరవలి పాఠశాలలో రికార్డుల నిర్వహణ, విద్యార్థుల నోట్ పుస్తకాలు సక్రమంగా లేవని దీనిపై ఉపాధ్యాయులకు నోటీసులు ఇవ్వాలని ఎంఈఓ డి హైమావతిని ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన సమయంలో కోర్సు పూర్తి చేసి విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహన పెంపొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ డి హైమావతి, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మోర్త ఉన్నత పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం

ఏలూరు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందజేత

పెరవలి: తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడుకి తన సొంత ఖర్చులతో ఏలూరు వెళ్లి పింఛన్ అందించిన వలంటీర్ వసంతాడ రాజేష్‌ను సర్పంచ్ మండా హైమావతి, తదితరులు అభినందించారు. పెరవలి మండలం పిట్టల వేమవరానికి చెందిన మాకా సత్యనారాయణ, వెలగల తాతారెడ్డి తీవ్ర అనారోగ్యానికి గురై ఒకరు ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో మరొకరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీర్ శనివారం ఏలూరులో పింఛన్ అందజేశాడు.



ఏలూరులో పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాజేష్

వైభవంగా నరసన్న గ్రామోత్సవం



ఐఎస్.జగన్నాథపురంలో ఊరేగుతున్న నారసింహుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన మండలంలోని ఐఎస్.జగన్నాథపురంలో సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. ఈనెల 1న ప్రారంభమైన ఉత్సవాలు 6వ తేదీతో ముగియనున్నాయి. వేడుకల్లో భాగంగా ఆలయ ఆవరణలో నిత్యహోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం జగన్నాథపురం క్షేత్ర పురవీధుల్లో వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుందరగిరిపై స్వామివారిని దర్శించుకున్న పలువురు మహిళా భక్తులు పాలపొంగళ్లను తయారుచేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు.

పాస్టర్లపై దాడులు అరికట్టాలి

నల్లజర్ల: శాంతియుత సమాజ స్థాపన కోసం ఏసుక్రీస్తు బోధనల ద్వారా ఈ సమాజాన్ని శాంతివైపు నడిపించాలని నిరంతరం కృషి చేస్తున్న దైవజనులపై, క్రైస్తవ సమాజంపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్, ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం నల్లజర్ల తహసీల్దారు మక్సూద్ ఆలీ, ఎస్సై నరసింహమూర్తికి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ముంగమూరి ప్రసాద్‌బాబు మాట్లాడుతూ గురువారం రాత్రి కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవంలో నిద్రిస్తున్న పాస్టర్ విలియంరాజుపై హత్యాయత్నం జరిగిందని ఈ ఘటనను తామంతా ఖండిస్తున్నట్టు చెప్పారు. రక్షణ కల్పించాలని వీరంతా విజ్ఞప్తి చేస్తున్నారు. వినతిపత్రం అందించిన వారిలో అధ్యక్షుడు ప్రసాద్‌బాబు, కార్యదర్శి ఇశ్రాయిల్‌రాజు, ప్రేమ్‌కుమార్, శ్యాంబాబు, గఫూర్, రాజ్‌కుమార్, డేవిడ్, సామ్యూల్‌రాజు, యోబు, కళానిధి, విక్టర్ పాల్, సువర్ణరాజు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

చాగల్లు: యువత మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు బానిస కావొద్దని ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మత్తు పదార్థాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై రమేష్ మాట్లాడుతూ యువత సన్మార్గంలో పయనించి చక్కటి భవిష్యత్తు పొందాలని ఆయన కోరారు. ప్రాణాలకు హాని కల్గించే నాటు సారా, గంజాయి, గుట్కా, ఖైనీ, వంటి పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఆయన అన్నారు. పాఠశాల హెచ్‌ఎం పి.వీర్రాజు, మహిళ పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నల్లజర్ల: స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఒక మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జగన్నాథపురానికి చెందిన గంగ (32)కు 15 ఏళ్ల క్రితం నల్లజర్లకు చెందిన అల్లే సత్యనారాయణతో వివాహమైంది. వారికి కుమార్తె, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. మూడేళ్ల క్రితం సత్యనారాయణ ప్రమాదంలో మృతిచెందాడు. అప్పటినుంచి గంగ పిల్లలతో అత్తగారైన నాగమణితో కలిసి ఉంటోంది. ఆమె దూబచర్లలో జీడిగింజల ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా అక్కడ అదే గ్రామానికి చెందిన వివాహితుడు కందుల శామ్యూల్‌రాజుతో సహజీవనం చేస్తోంది. ఈనెల 3న రాత్రి ఆమె ఇంటికి శామ్యూల్‌రాజు రావడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. శనివారం ఆమె ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఆమె చనిపోయేలా శామ్యూల్‌రాజే పురికొల్పాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. 8వ తరగతి చదువుతున్న మృతురాలి కుమార్తె హేమప్రియ నుంచి పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

నిడదవోలు రూరల్: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు సమిశ్రగూడెం హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణరెడ్డి శనివారం తెలిపారు. రాజమహేంద్రవరంకు చెందిన శెట్టి పార్థసారథి రెడ్డి అనే వ్యక్తి ఈనెల 3న ఇంటి నుంచి బైక్‌పై మార్టేరు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలవడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు పార్థసారథిరెడ్డి ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి

నిడదవోలు రూరల్: పాత గొడవల నేపథ్యంలో ఓవ్యక్తిపై దాడి చేసిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం హెడ్‌కానిస్టేబుల్ రామారావు శనివారం తెలిపారు. మండలంలోని పురుషోత్తపల్లికి చెందిన తుమ్మలపల్లి శ్రీనివాస్‌ను ఈనెల 3వ తేదీ రాత్రి అదే గ్రామానికి చెందిన కొప్పాటి లక్ష్మీనారాయణ, షేక్ శ్రీనివాస్ దాడి చేశారన్నారు. దీంతో తీవ్రగాయాలైన శ్రీనివాస్ రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

లారీ ఢీకొని కూలీ మృతి

పెరవలి: కూలిపని ముగించుకుని ఇంటికి వెళుతున్న వ్యక్తిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. పెరవలి ఎస్సై యం సూర్య భగవాన్ తెల్పిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కాపవరానికి చెందిన జక్కంశెట్టి నాగరాజు (45) శనివారం వ్యవసాయ కూలీ పని ముగించుకుని పెరవలి నుంచి స్వగ్రామం తన మోటార్ సైకిల్‌పై పయనమయ్యాడు. పెరవలి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో వచ్చే సరికి నరసాపురం నుంచి పెరవలి వైపు వేగంగా వస్తున్న లారీ అతడిని ఢీకొట్టింది. లారీ వేగానికి ఎదురుగా వస్తున్న నాగరాజు ఎగిరి సుమారు 10 మీటర్ల దూరంలో పడ్డాడని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో నాగరాజు తలకు బలమైన గాయం అవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానిక కారణమని స్థానికులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామ పోలీసులు తెలిపారు.

వీడిన మహిళ మిస్సింగ్ కేసు మిస్టరీ

తాళ్లపూడి: రాగోలపల్లికి చెందిన నీరుకొండ శ్రీనివాసరావు భార్య మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది. తాళ్లపూడి ఎస్సై కె వెంకట రమణ వివరాలను వెల్లడించారు. శనివారం ఆమె తల్లిదండ్రులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్సై ముందు హాజరయ్యారు. మూడు నెలలుగా రాజమండ్రి, విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్టు ఎస్సైకు ఆమె తెలిపింది. తన భర్త, అత్త, ఆడపడుచుల మానసిక, శారీరక వేధింపుల వల్ల ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు తెలిపారు. ఈ విషయంలో తల్లిదండ్రులు చేసిన హత్యా ఆరోపణలన్నీ అవాస్తమని ఆమె తెలిపారు. ఆమె ఇచ్చిన వాగ్మూలం ఆధారంగా క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటరమణ తెలిపారు.

యువతి ఆత్మహత్య

పెరవలి: పెద్దలు కుదిర్చిన వివాహం ఇష్టం లేక ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పలేక ఓ యువతి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పెరవలి ఎస్సై యం సూర్యభగవాన్ తెల్పిన వివరాలిలా ఉన్నాయి. పెరవలి మండలం కాపవరానికి చెందిన యువతికి (17) ఇటీవల పెళ్లి సంబంధం ఖాయమైంది. అదే గ్రామానికి చెందిన అడపా కార్తీక్ ఆమె వెంట పడి ఇద్దరు కలిసి చనిపోదామంటూ ప్రోత్సహించి, పురుగు మందు తెచ్చి యువతికి ఇచ్చాడని తెలిపారు. ఇదే నిజమనుకుని యువతి పురుగుమందు తాగిందని తెలిపారు. యువకుడి ప్రోద్బలంతో తన కుమార్తె పురుగుమందు తాగి మృతి చెందిదని ఆమె తల్లితండ్రులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై సూర్య భగవాన్ శనివారం తెలిపారు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.